ఇందిరా డెయిరీని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- అర్హులైన నిరుద్యోగులకు రుణాలిచ్చి ఉపాధి చూపుతాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ఎర్రుపాలెంలో ఇందిర మహిళా డెయిరీ ప్రారంభోత్సవం

6

భద్రాద్రిలో వైభవంగా శమీపూజ

- రామయ్యకు మహాపట్టాభిషేకం
- ఆకట్టుకున్న శ్రీరామలీల మహోత్సవం

భద్రాచలం, అక్టోబరు 13: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో విజయదశమి సందర్భంగా శనివారం శమీపూజ వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులను, స్వామివారి ఆయుధాలను మేళతాళాలతో దసరా మండపానికి తీసుకొచ్చారు. అనంతరం సంప్రదాయబద్ధంగా శమీపూజ నిర్వహించారు. ఉదయం ఆరాధన ప్రక్రియలో భాగంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించి అష్టోత్తర, సహస్రనామార్చన నిర్వహించారు. తరువాత శ్రీసీతారామచంద్రస్వామికి నిత్యకల్యాణం, శ్రీరామ మహాపట్టాభిషేకాన్ని నిర్వహించారు. దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీమద్రామాయణ పారాయణం చివరి రోజున పూర్ణాహుతి చేశారు.

సంప్రదాయబద్ధంగా శమీపూజ

శ్రీసీతారామచంద్రస్వామికి మహారాజు అలంకారం చేసి బాజాభజంత్రీలు, మేళతాళాలతో విజయోత్సవం, శమీ పూజ కోసం స్థానిక దసరా మండపానికి తీసుకొచ్చారు. తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. తరువాత సంప్రోక్షణ నిర్వహించి షోడశోపచారాలతో శమీ వృక్షానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సుదర్శనం, ఖడ్గం, ధనస్సు, గద తదితర ఆయుధాలకు పూజలు చేసి ఉద్వాసన పలికారు. చివరగా ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరునకు ఆవాహనం చేసి బాణాలు సంధించారు. ఈ సందర్భంగా జమ్మి పత్రాలు అక్షింతలతో అర్చన చేసి చివరగా వాటిని భక్తులపై చల్లారు. అనంతరం శ్రీరామలీల మహోత్సవాన్ని నిర్వహించగా వందలాది మంది భక్తులు తిలకించారు. ఈ సమయంలో రావణాసుర బొమ్మపై దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి బాణాన్ని సంధించారు. అంతకుముందు మహాలక్ష్మీ అలంకారంలో లక్ష్మీతాయారు అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఈఈ వి.రవీంద్రనాథ్, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్ పాల్గొన్నారు.



బాణం సంధిస్తున్న ఈవో రమాదేవి



శ్రీరామ మహాపట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



జమ్మిబండ వద్ద పూజలు



స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి తుమ్మల

అంబరాన్నంటిన దసరా సంబురాలు

- నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- ఖమ్మం జమ్మిబండవద్ద జాతర సందడి
- గుట్ట ఆలయాన్ని దర్శించిన మంత్రి తుమ్మల

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 13: ఆలయ సందర్శనలు, దైవ పూజలు, గారెలు, పరమాన్నాలు, విందులు వినోదాలు, పాలపిట్ట దర్శనాలు, శమీపూజలతో జిల్లాలో దసరా సంబురాలు అంబరాన్నంటాయి. ఖమ్మం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రజలు శనివారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామునుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. అనంతరం ఇళ్లల్లో బంధుమిత్రులతో పూజలు, పిండి వంటలతో సందడి చేశారు. దసరా సందర్భంగా ఖమ్మంలో జమ్మిబండవద్ద అమ్మవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దాంతో జమ్మిబండవద్ద తిరునాళ్ల సందడి నెలకొంది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జమ్మికొమ్మలకు శమీ పూజ నిర్వహించారు. దసరా ఉత్సవంలో భాగంగా భక్తులు పాలపిట్టను తిలకించారు. ఇందిరానగర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం (పర్ణశాల)లో దసరా సంబురాలు ఘనంగా నిర్వహించారు. దసరా రోజు ఆలయ కమిటీ భక్త బృందం సభ్యులు దావా నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన శమీ పూజలో డివిజన్ కార్పొరేటర్ దావా మాధురి పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి శోభాయాత్ర కార్యక్రమాన్ని ఆదివారం ఖమ్మం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా కన్నుల పండువగా నిర్వహించారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా పది రోజుల ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు.



ప్రజా ప్రభుత్వంలో ప్రతిపైసా

రైతుల కోసమే...

- పంటల ధరల స్థిరీకరణ కోసం ప్రయత్నం
- రూ.లక్ష రుణమాఫీ చేయలేని బీఆర్ఎస్ మాటలు నమ్మొద్దు
- కాలుష్యరహిత గ్రీన్‌పవర్ ఉత్పత్తికి ప్రోత్సాహం..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పామాయిల్ రైతులకు ఉజ్వల భవిష్యత్: మంత్రి తుమ్మల
- దూరదృష్టితోనే స్వయం విద్యుత్ ప్లాంట్: మంత్రి పొంగులేటి
- అశ్వారావుపేటలో పామాయిల్ రైతు సదస్సు

అశ్వారావుపేట/అశ్వారావుపేట టౌన్/అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 13: ఎన్నో ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపైసా రైతులు, పేదలకు ఉపయోగపడేలా ఖర్చు చుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నామని, ఇప్పటి వరకు రైతులకు రూ.18వేల కోట్లు చెల్లించినట్లు తెలిపారు. త్వరలో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. అశ్వారావుపేటలోని పామాయిల్ పరిశ్రమలో 2.5మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని శనివారం ప్రారంభించిన సందర్భంగా పామాయిల్ రైతులకు జాతీయస్థాయిలో అవగాహన సదస్సును నిర్వహించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన ఈ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీని ప్రకటించి ఐదేళ్లు కాలయాపన చేసి రైతులను మోసం చేసిందన్నారు. అలాంటి పార్టీ ఏక కాలంలో 15 రోజుల్లోనే రూ.18వేలు కోట్ల రైతు రుణాలను మాఫీ చేసిన తమ ప్రభుత్వంపై రైతులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. రైతులు దీన్ని గమనించాలని కోరారు. అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో వచ్చే వ్యర్థాలతో స్వయంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా 2.5 మెగావాట్ల సామర్థ్యంతో బయో పవర్ ప్లాంట్‌ను రూ.36 కోట్లతో నిర్మించడం సంతోషకరమన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందన్నారు. కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 20వేల మెగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్రంలో కొన్ని గ్రామాలను సోలార్ విద్యుత్ గ్రామాలుగ మర్చేందుకు పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని, అశ్వారావుపేట నియోజకవర్గంలోనూ రెండు గ్రామాలను ఎంపిక చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

పామాయిల్ రైతులకు ఉజ్వల భవిష్యత్

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పామాయిల్ పంటకు ఉజ్వల భవిష్యత్ ఉందని, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో టన్ను రూ.20వేలు దాటుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ రూ.31కోట్లతో రైతు రుణమాఫీ పూర్తిగా చెల్లించబోతున్నామన్నారు. రైతు భరోసాను రెండో పంటనుంచి అమలు చేస్తామని మంత్రి తుమ్మల ప్రకటించారు. పంటల బీమాకు రూ.3వేల కోట్ల ప్రీమియంను ప్రభుత్వమే రైతుల తరుపున చెల్లిస్తుందని ప్రకటించారు. పంటలను నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించామన్నారు. తెలంగాణాలో పామాయిల్ రైతు రాజులా ఉండాలనేదే తమ లక్ష్యమన్నారు. ఆంధ్రాలో నర్సరీలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారని, ఇక్కడ రైతులకు కూడా ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలని, పొలాల మధ్యలోనుంచి వెళ్లిన విద్యుత్ లైన్లను మార్చుకోవడానికి అనుమతులు ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మంత్రి తుమ్మల కోరారు. డిసెంబర్ లోపు రైతు రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. వచ్చే నెలలో పామాయిల్ మరో వెయ్యి నుంచి రూ.1,500 వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. కొత్తగూడెం జిల్లాలో అత్యధికుల భూములకు పట్టాలు ఉండవని, అలాంటి భూముల్లో పంటలు వేసేవారికి మొక్కలు, ఇతర రాయితీలు ఇచ్చేల రెవెన్యూ మంత్రి ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

దూరదృష్టితో స్వయం విద్యుత్ ప్లాంట్

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇందిరమ్మ రాజ్యం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం రైతుల సంక్షేమం కోసం పాటుపడుతోందన్నారు. అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ స్వయంగా 2.5 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను వ్యర్థాలతో తయారు చేసుకోవడం హర్షణీయమన్నారు. ప్రతి ఫ్యాక్టరీ ఇలా స్వయం విద్యుత్‌ప్లాంట్‌ను తయారు చేసుకోవాలని సూచించారు. దూరదృష్టితోనే ఆయిల్‌ఫెడ్ ఈ ప్లాంట్‌ను నిర్మించిందన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం ఇదే విధానాన్ని ప్రజలలోకి తీసుకెళ్లనుందన్నారు. రైతులు ములగ, వెదురు వంటి పంటలను అంతర పంటలుగా సాగుచేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

పామాయిల్ రైతులకు శాస్త్రవేత్తల మెళకువలు

పామాయిల్ సాగులో నూతన పద్ధతులు, తగిన మెళకువలతో మంచి దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు సూచించారు. పరిశ్రమ ఆవరణలో ఏర్పాటు చేసిన సదస్సుకు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా రైతులు హాజరయ్యారు. సదస్సులో వివిధ యూనివర్సిటీలకు చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఖమ్మం, పాల్వం, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లితో పాటు ఆంధ్రా, తెలంగాణాలోని వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన అన్నదాతలు అడిగిన అనేక ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చి పంటల్లో చేపట్టాల్సిన అంశాలపై సూచనలు చేశారు. సదస్సులో ఆయిల్‌ఫెడ్ సమాఖ్య కన్సల్టెంట్ డాక్టర్ బి.ఎస్.రావు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బన్న, కొండా లక్ష్మణ్ యూనివర్సిటీ డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ రాజశేఖర్, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, అశ్వారావుపేట ఉద్యాన పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ విజయ్‌కృష్ణ పలు అంశాలపై మాట్లాడి రైతుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.





అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో పవర్ ప్లాంట్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో బయో పవర్‌ప్లాంట్

ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి 6

మనస్తాపంతో

కానిస్టేబుల్ ఆత్మహత్య



చికిత్స పొందుతున్న కానిస్టేబుల్

- గంజాయి చోరీ కేసులో సస్పెండైన సాగర్
- ఇద్దరు ఎస్‌ఐలు, మరో వ్యక్తి కలిసి తనను బలి పశువు చేశారని సెల్ఫీవీడియో
- అనంతరం పురుగులమందు తాగి ఆసుపత్రికి
- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి

బూర్గంపాడు/ఏన్కూరు, అక్టోబరు 13: గంజాయి చోరీ కేసులో తనను బలిపశువును చేశారని ఆరోపిస్తూ ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏన్కూరులో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2013 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన ఏన్కూరుకు చెందిన భూక్యా సాగర్(33) భద్రాద్రి జిల్లా బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన సమయంలో ఈ ఏడాది జనవరిలో బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో పలు కేసుల్లో సీజ్ చేసిన గంజాయి మాయమైంది. ఈ ఘటనపై విచారణ చేపట్టిన అధికారులు కానిస్టేబుల్ సాగర్‌ను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేశారు. అప్పటినుంచి ఇంటివద్దనే ఉంటూ మనోవేదనకు గురయ్యాడు. అయితే మళ్లీ ఈనెల 10న ఏడూళ్లబయ్యారం పోలీసుస్టేషన్‌కు పోస్టింగ్ ఇవ్వగా సస్పెండ్ అయిన సమయంలో బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఎస్‌ఐ రాజ్‌కుమార్ తాజాగా ఏడూళ్లబయ్యారం పోలీస్‌స్టేషన్‌లో ఉండడంతో మనస్థాపం చెందిన సాగర్ ఈనెల 12న ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చి ఏన్కూరు సాగర్ కాలువ సమీపంలో పురుగులమందు తాగాడు. అయితే అంతకంటే ముందే కానిస్టేబుల్ సాగర్ ఓ సెల్ఫీ వీడియో రికార్డు చేసి కుటుంబ సభ్యులకు పంపాడు. అందులో అతడు మాట్లాడుతూ గంజాయి చోరీ కేసులో తనను బలి పశువును చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఎస్‌లు సంతోష్, రాజ్‌కుమార్‌లు బూర్గంపాడుకు చెందిన గోనెల నాని అనే వ్యక్తితో కలిసి గంజాయిని అమ్ముకున్నారని పేర్కొన్నాడు. గంజాయి మాయమైన వ్యవహారంలో ఈ ఇద్దరు ఎస్‌ఐల పాత్ర ఉందని, వారిని వదిలేసి తనపై చర్యలు తీసుకోవడంతో మనస్థాపానికి గురయ్యానని తెలిపాడు. పురుగులమందు తాగిన అనంతరం సాగర్ నడుచుకుంటూ ఏన్కూరులోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. కుటుంబసభ్యులకు విషయం తెలియడంతో వెంటనే వారు అతడిని ఖమ్మం తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం 5గంటల సమయంలో మృతిచెందాడు. కానిస్టేబుల్ సాగర్‌కు భార్య తేజస్విని ఏడేళ్ల కుమార్తె (మిగతా 6వ పేజీలో)

అంతర పంటలతో అధిక ఆదాయం



వక్క సాగును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- నిపుణులతో చర్చించి వక్కసాగుపై నిర్ణయం
- ఏలూరు జిల్లా కామవరపుకోటలో మంత్రి తుమ్మల

ఖమ్మంసంక్షేమవిభాగం, అక్టోబరు 13: అంతర పంటలతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వక్క పంటకు తెలంగాణ అనువైన ప్రాంతమని, నిపుణులతో చర్చించి దీని సాగుపై నిర్ణయం తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఏపీలోని ఏలూరు జిల్లా కామవరపు కోటలో ఆదివారం వాణిజ్య పంటలైన వక్క సాగును మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా వక్క సాగు రైతులతో సాగు పద్ధతులు, ఆదాయ వ్యయాలపై సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణలో దీని విస్తరణ అంశాలు, అవకాశాలపై నిపుణులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వక్క సాగుతో రైతులు లక్షల్లో ఆదాయం సంపాదిస్తున్నారన్నారు. అనేక మంది రైతులు కొబ్బరి, పామాయిల్ తోటలలో అంతర పంటలు సాగు చేస్తూ అధిక లాభాలు అర్జిస్తున్నారని పేర్కొన్నారు. అన్నదాతలు ఆధునిక సాగువైపు అడుగులు వేయాలని, అధిక ఆదాయం పొందేందుకు ఈ పంటలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. అనేకమంది రైతులు పోక, వక్క తోటల్లో అంతర పంటలతో అద్భుతాలు చేస్తున్నారని, తద్వారా అధిక ఆదాయం పొందుతున్నారని మంత్రి పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వక్క సాగు అనుకూల నేలలు, వాతావరణ పరిస్థితులు, నీటి వినియోగం తదితర అంశాలపై నిపుణులతో చర్చించి సాగును ప్రోత్సహించినట్లు మంత్రి పేర్కొన్నారు. వక్క సాగు చేస్తున్న అనేకమంది రైతులు నుంచి అనూహ్య స్పందన లభించిందని, సాగు చాలా ఆశాజనకంగా ఉందని రైతుల పేర్కొన్నట్లు మంత్రి వివరించారు. తెలంగాణ రైతాంగాన్ని రాజును చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతన్నల శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



పాలేరు ఎడమకాల్వకు

మళ్లీ పొంచి ఉన్న ప్రమాదం

- 21 అడుగులకు పెరిగిన జలాశయం నీటిమట్టం
- మరింత పెరిగితే కాల్వకు గండిపడే అవకాశం

6



సాంబశివరావు, సరోజిని మృతదేహాలు

పాపం పండుటాకులు

- అనారోగ్యంతో ఎవరికీ భారం కాకూడదని వృద్ధ దంపతుల ఆత్మహత్య
- ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో ఘటన

ఎర్రుపాలెం, అక్టోబరు 13: ఎర్రుపాలెం మండల కేంద్రంలో అనారోగ్య కారణాలతో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఎర్రుపాలెం ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రుపాలెంలో నివాసం ఉంటున్న రేమిడిచర్ల గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధనేకుల సాంబశివరావు(72) అతడి భార్య సరోజిని (65) అనారోగ్య సమస్యలు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్ నోట్ రాసిపెట్టి తమ స్వగృహంలో శనివారం రాత్రి పొలంలో గడ్డినివారణకు వినియోగించే మందుతాగారు. సాంబశివరావు చాలాకాలం క్రితం తన స్వగ్రామం రేమిడిచర్ల నుంచి ఎర్రుపాలేనికి వచ్చి స్థిరపడ్డాడు. గత కొన్నేళ్లుగా అతడి భార్య సరోజిని అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. సాంబశివరావుకు వివాహమైన కుమార్తె, కుమారుడున్నారు. కుమారుడు లండన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే కొద్దికాలం క్రితం సాంబశివరావు హృద్రోగంతో ఆసుపత్రిలో చేరాడు. బైపాస్‌సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. కుమారుడు విదేశాల్లో, బంధువులు దూరంగా ఉండడంతో తమ భవిష్యత్ జీవనం దుర్భరంగా ఉంటుందని భావించిన ఆ దంపతులు అనారోగ్యంతో తాము ఎవరికీ భారం కాకూడదని భావించి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్టు ఎర్రుపాలెం ఎస్‌ఐ తెలిపారు. గ్రామంలో మంచిపేరున్న దంపతులు ఆత్మహత్య చేసుకోవడం విచారకరమని పలువురు నాయకులు, గ్రామస్థులు సంతాపం తెలిపారు.

డీఏ, పీఆర్సీ సాధనకు కృషి

- జేఏసీ పునర్నిర్మాణానికి సన్నాహం
- టీజీజేఏసీ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు



టీఎన్జీవో సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 13: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ, డీఏల మంజూరుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయనున్నట్లు టీజీజేఏసీ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్ ఖమ్మం జిల్లా సమావేశం ఆదివారం టీఎన్జీవో భవన్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ, హెల్త్ కార్డులపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

సప్లిమెంటరీ బిల్స్ 3000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్సీ ఇప్పటికే వచ్చి ఉంటే ఒక ఉద్యోగికి 20,000 వేతనం పెరిగేదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు సంబంధించి 50 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిలో 11 సమస్యలు ఆర్థిక పరమైనవని, మిగతావి ఆర్థికపరమైనవి కాదు కాబట్టి వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. త్వరలో సకల ఉద్యోగుల కుటుంబాలతో వనభోజనాల కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కన్వీనర్ కొణిదెన శ్రీనివాస్, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు, పీఆర్టీయూ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, విజయ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాయల నరసింహారావు, యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు దొడ్డ పుల్లయ్య, తెలంగాణ పీఆర్టీయూ అధ్యక్షుడు కొమ్మినేని అనిల్ కుమార్, ఎం.సురేష్ కుమార్, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మామునూరి రాజేష్, గంటా రవీందర్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ లైబ్రేరియన్స్ అసోసియేషన్ నాయకులు నక్కా ప్రసాద్ బాబు, ఎల్. ఫణి కుమార్, టీఎన్జీవోస్ నాయకులు జడ్.ఎ.జ్ఞా.శైపాల్, టీజీఎస్ జిల్లా అధ్యక్షుడు కాస్తల సత్యనారాయణ, కార్యదర్శి మోదుగు వేలాద్రి, గంగవరపు బాలకృష్ణ, గుంటుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీ దేవిశరన్నవరాత్రులు

- దసరా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం, అక్టోబరు 13: మండలంలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రులు ఆదివారంతో ముగిశాయి. విజయదశమి సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని తలపెట్టిన ప్రతి పనిలో ప్రభుత్వం విజయం సాధించాలని రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఉపముఖ్యమంత్రి భట్టికి ఆలయఅధికారులు వేదపండితులు మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయ సంప్రదాయంలో పూర్ణకుంభంతో స్వాగతంపలికారు.

విజయదశమి సందర్భంగా శనివారం శ్రీరాజరాజేశ్వరి అలంకారంలో భక్తులు అమ్మవారిని దర్శనంచేసుకున్నారు. పెద్దఎత్తున భక్తులు శ్రీవారిని దర్శనం చేసుకున్నారు. సాయంకాలం శమీపూజ నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో కోలాట నృత్యాలతో ఊరేగింపు గ్రామ సేవ నిర్వహించారు. జమలాపురం పెద్దచెరువులో పెద్దచెరువులో దేవి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, పర్యవేక్షకురాలు కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్యఅర్చకులు మురళీమోహన్‌శర్మ, రాజీవ్ శర్మ, కళ్యాణ్‌రామ్, వేదపండితులు, పురోహితులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం భట్టికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

పులిసంచారంపై వదంతులు

- భయాందోళనలో రైతులు, ప్రజలు

జూలూరుపాడు, అక్టోబరు 13: పులి సంచరిస్తుందనే వదంతులు వినిపిస్తుండటంతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జూలూరుపాడు - ఏన్కూరు అటవీ సరిహద్దు సమీపంలో గల జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని ఎర్రగుట్ట సమీపంలో రైతుల పొలాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు ఆ ప్రాంత రైతులు అంటున్నారు. ఆదివారం రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎర్రగుట్ట సమీపంలోని ఓ రైతు పొలంలో జంతువు అడుగులను గుర్తించడం జరిగిందని.

వాటిని పరిశీలించగా పెద్ద పులి అడుగులేనని వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏన్కూరు మండలంలోని ఒంటిగుడిసె, మూన్యాతండా గ్రామానికి చెందిన మాన్‌సింగ్ రైతు ఎర్రగుట్ట సమీపంలో తన చేలో పత్తిపంటను సాగు చేశాడు. కోతుల బెడద నుంచి పత్తిని రక్షించుకునేందుకు చేను వద్ద కుక్కను కట్టేశాడు. కాగా ఆ కుక్కను జంతువు ఈడ్చుకెళ్లినట్లు సదరు రైతు చుట్టుపక్కల రైతులకు తెలిపారు.

జూలూరుపాడు ఎఫ్ఆర్‌వో ప్రసాద్‌రావు మాట్లాడుతూ జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలో, కనకగిరి అటవీ ప్రాంతంలో పెద్దపులి లేదని వదంతులను నమ్మవద్దని తెలిపారు. మూడు రోజుల క్రితం ఎర్రగుట్ట సమీపంలో ఓ పొలంలో జంతువు అడుగులు కనిపించగా వాటిని అటవీశాఖ ఉన్నతాధికారులకు, వైల్డ్‌లైఫ్ అధికారులకు పంపించగా వాటిని పరిశీలించి తోడేలు అడుగులుగా నిర్ధారించినట్లు తెలిపారు.

ఎందరో దాతలు.. మహా పోషకులు

- రామయ్యకు భూమి, వస్తు, భవన, ధన రూపేణ అందజేత
- రేపే భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో దాతలకు సత్కారం



భద్రాచలం, అక్టోబరు 13: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రం ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎందరో దాతలు, మహాదాతలు తమ ఆరాధ్య దైవమైన భద్రాద్రి రామయ్యకు తమవంతుగా భూమి, వస్తు, భవన, ధనరూపేణ విరాళాలుగా సమర్పించారు. 17వ శతాబ్దంలో భక్తరామదాసుగా ప్రసిద్ధిగాంచిన కంచర్ల గోపన్న భద్రాద్రి రామాలయాన్ని నిర్మించడమే కాకుండా చింతాకు పతకం, పచ్చల పతకం, మూడుసూత్రాలతో మాంగల్యం తదితర అజరామరమైన ఆభరణాలను సైతం చేయించి భక్తిప్రపత్తులతో సమర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దేవాదాయ శాఖ మంత్రిగా పని చేసిన కల్లూరి చంద్రమౌళి, రామాలయ పునరుద్ధరణ సంఘం అధ్యక్షుడిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి 1969లో భక్తుల సహకారంతో జీర్ణోద్ధరణ గావించారు. ఇదే కోవలో ఎందరో దాతలు.. మహాదాతలు తమవంతుగా శ్రీరాముని సేవలో తరించారు. ఈ నేపథ్యంలో భద్రాద్రి రామాలయ అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ రూపాల్లో సహకారం అందిస్తున్న దాతలను సత్కరించే కార్యక్రమంకు 2023లో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఈసారి సైతం మరింత భారీ ఎత్తున దాతల సత్కార కార్యక్రమంకు రంగంసిద్ధం చేశారు. మంగళవారం నాడు భద్రాచల పుణ్యక్షేత్రంలో దాతల సత్కారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రూ.లక్ష ఆపైన భద్రాద్రి దేవస్థానంకు వస్తు, భూమి, భవనం , ధన, ఇతరత్రా రూపేణ ఆర్థిక సహకారం అందించిన వారిని ఆహ్వానించి సన్మానించనున్నారు. వీరికి భద్రాద్రి రామాలయంలో ప్రత్యేక దర్శనం, పూజలు, వేద ఆశీర్వచనం అందించడంతో పాటు స్వామి వారి అన్నప్రసాదంను సైతం వారికి అందజేయనున్నారు. దేవస్థానం తరఫున స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక అందజేయనున్నట్లు తెలుస్తోంది.

రామయ్యకు విరాళాలు సమర్పించిన దాతలెందరో

భద్రాద్రి రామయ్యను ఆరాధించే దాతలు ఎందరో వివిధ రూపాల్లో విరాళాలను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ క్రమంలో సుమారు 1100 మందికి పైగా దాతలు ఈ కార్యక్రమానికి తరలిరానున్నట్లు తెలుస్తోం ది. భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి మూలవరులకు స్వర్ణ కవచం 10.336 కిలోల బంగారంతో బెంగళూరుకు చెందిన వి.రంగరాజు దంపతులు చేయించారు. అలాగే భారత్ బయోటెక్ లిమిటెడ్ రూ.కోటి విరాళం ఉచిత నిత్యాన్నదాన పథకానికి సమర్పించింది. జీఎంఆర్ సంస్థ ఆలయం తూర్పు, దక్షిణం వైపు భక్తుల సౌకర్యార్థం గాల్వాలియం షీట్లతో క్యూలైన్ షెడ్లను ఏర్పాటు చేసింది. మరెందరో భక్తులు స్వర్ణ, రజతాలతో వాహనాలు పూజా పాత్రలు సమర్పించారు.

బస్టాండ్‌లో పనిచేయని సీసీ కెమెరాలు



ఖమ్మం ఖానాపురం హవేలి, అక్టోబరు 13: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ నూతన బస్టాండ్‌లో నిఘానేత్రం నిద్రపోతోంది. పేరుకే సీసీ కెమెరాలు పెట్టారనే విమర్శలు వినపడుతున్నాయి. బస్టాండ్‌లో దొంగల భయం అధికంగా ఉన్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవటం లేదంటున్నారు. ఈ బస్టాండ్ నుంచి రోజు 30 వేల నుంచి 35 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ బస్టాండ్‌లో మొత్తం 16సీసీ కెమెరాలు ప్రయాణికుల భద్రత కొరకు ఏర్పాటు చేశారు. కాని గత కొంత కాలంగా వాటిలో 9 కెమెరాలు పనిచేస్తుండగా మిగిలిన 7 కెమెరాలు పనిచేయటంలేదు. బస్టాండ్ ప్రాంగణంలో, ప్రయాణికులు బస్సులు ఎక్కే సమయంలో ప్రయాణికుల పర్సులు, డబ్బులు, బంగారం, మొబైల్ ఫోన్లు, తదిత వస్తువులను దొంగలు దొంగిలించిన సంఘటనలు చాలా జరిగినప్పటికీ అధికారులు భద్రతా విషయంలో నిర్లక్ష్యంగా ఉండటంపై పలువురు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా పంచపాండవుల శోభయాత్ర

- దసరా సందర్భంగా రెండు రోజులపాటు పూజలు
- శోభాయాత్రను ప్రారంభించిన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



పంచపాండవుల విగ్రహాలు



శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

కామేపల్లి, అక్టోబరు 13: పంచపాండవుల పేర్లు మనం మహాభారతంలో విన్నాం.. చరిత్ర పుస్తకాల్లో చదివాం.. కానీ వారి రూపాలు ఎవరికీ తెలియదు. కానీ ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో పింజరమడుగు గ్రామంలో పంచపాండవుల రూపాలతో విగ్రహాలు, ఆలయం ఉందని చాలా మందికి తెలియదు. ఈ గ్రామంలో 200 ఏళ్ల నాటి పురాతన పంచపాండవుల దేవాలయం ఉంది. ఇక్కడ ఏటా విజయదశమి రోజున శ్రీ కృష్ణ పంచపాండవుల విగ్రహాలను భక్తి శ్రద్ధలతో గ్రామంలో ఊరేగిస్తారు. విజయదశమి రోజు సాయంత్రం విగ్రహాలను రథంలో ఎక్కించి మొదట ఊరి చివర జమ్మిచెట్టు దగ్గరకు తీసుకెళ్లి అక్కడ పూజలు నిర్వహించి శోభయాత్ర ప్రారంభిస్తారు. రెండు రోజులు సన్నాయి మేళం, మహిళలు, చిన్నారులు, పెద్దల నృత్యాలతో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో గ్రామస్థులతో పాటు, వారి బంధువులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు మూడు, నాలుగు జిల్లా నుంచి భక్తులు విచ్చేశారు. ఏడేళ్ల క్రితం గ్రామ ప్రజలు, మత్స్య సొసైటీ సభ్యులంతా కలిసి రూ.40లక్షల వ్యయంతో నూతన ఆలయం నిర్మించారు. దసరా రోజు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పంచపాండవుల ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించి శోభయాత్రను ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కనకయ్యను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు దమ్మాలపాటి సత్యనారాయణ, నల్లమోతు లక్ష్మయ్య, గుజ్జర్లపుడి రాంబాబు, గుగులోత్‌దేవి, వింజం నాగభూషణం కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

పామాయిల్ తోటల్లో విద్యుత్ లైన్ల మార్పిడికి అవకాశం

- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



మాట్లాడుతున్న ఆలపాటి రాంచంద్రప్రసాద్

దమ్మపేట, అక్టోబరు 13: పామాయిల్ తోటల్లో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ లైన్ల మార్పిడిని ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క అశ్వారావుపేటలో జరిగిన రైతు సదస్సులో ప్రకటించటం పట్ల రైతులు హర్షం వ్యక్తంచేశారు. నాచారం గ్రామంలో సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు నివాసంలో ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర పామాయిల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, పామాయిల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్ మాట్లాడారు. పామాయిల్ తోటల్లో అస్తవ్యస్తంగా ఉన్న లైన్లను లైన్లను మార్చుకునేందుకు ప్రభుత్వానికి భారీగా డబ్బులు చెల్లించి అనుమతులు పొందాల్సి ఉండేదన్నారు. వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ద్వారా రైతులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లటంతో రైతులు తమ సొంత ఖర్చులతో విద్యుత్ లైన్ల మార్పిడికి అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి బట్టి ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల పామాయిల్ గెలల ధర టన్నుకు రూ.20 వేలు వచ్చే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని ప్రకటించటాన్ని రైతులు స్వాగతించారు. పామాయిల్ మొక్కలు ఇచ్చిన రైతులకు డ్రిప్ సౌకర్యం కల్పించటం, రైతులకు మేలు చేసే రుణమాఫీ అంశాలు ప్రకటనపై కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇందిరమ్మకమిటీల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంత్రులు బట్టి, తుమ్మల, పొంగులేటి సహకారంతో నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ప్రజలకు అందుబాటులో ఉంటూ కృషి చేస్తున్నారని కొనియాడారు. అశ్వారావుపేటలో జరిగిన పామాయిల్ సదస్సును విజయవంతం చేసినందుకు కృషి చేసిన రైతులకు అభినందనలు తెలిపారు. అంతకు ముందు రైతులు, రైతు సంఘం నాయకులు గండుగలపల్లిలో అయన నివాసంలో మంత్రి తుమ్మల కలిసి రైతులకు మేలు చేసే విధంగా అశ్వారావుపేటలో పామాయిల్ రైతు సదస్సు నిర్వహించి శాస్త్రవేత్తలో పలు సూచనలు, సలహాలు రైతులకు మేలు చేసేలా ఉన్నాయని మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసమావేశంలో సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, ఎర్రా వసంతరావు, కాసాని నాగప్రసాదు, చీకటి శ్రీనివాసరావు, గూడపాటి వెంకట్రావు, ఎర్రగొర్ల రాధాకృష్ణ, నరుకుళ్ల భాస్కరరావు, మన్నెం అప్పారావు ఉన్నారు.

సాయిబాబా మరణం విప్లవోద్యమాలకు తీరనిలోటు

- ఎన్డీ, సీపీఎం నేతల సంతాపం



సాయిబాబాకు నివాళులు అర్పిస్తున్న ఎన్డీ నేతలు

ఇల్లెందు, అక్టోబరు 13: పౌరహక్కుల నేత, విప్లవ మేధావి ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం భారత విప్లవోద్యమాలకు తీరని లోటని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఇల్లెందు న్యూడెమోక్రసీ కార్యాలయంలో ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలువేసి నివాళి అర్పించిన అనంతరం వారు మాట్లాడారు. ప్రొఫెసర్ సాయిబాబాను మతోన్మాద మోదీ ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాలకు పైగా మహారాష్ట్ర జైలులో నిర్బంధించిందని అన్నారు. 90శాతం అంగ వికలాంగుడైన సాయిబాబాకు కనీసం వైద్య సదుపాయం కూడా కల్పించకుండా మానసిక, శారీరక ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, అది ముమ్మాటికీ ప్రభుత్వ హత్య అన్నారు. న్యూడెమోక్రసీ ఇల్లెందు పట్టణ కార్యదర్శి కొక్కు సారంగపాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు డి.మోహన్ రావు, రామిశెట్టి నరసింహారావు, మండల వెంకన్న తదితరులు పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన సాయిబాబా సంతాప సభలో జిల్లా నాయకులు అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ మాట్లాడుతూ మతోన్మాద శక్తులు ప్రశ్నించే గొంతుకను ప్రణాళిక ప్రకారంగా అక్రమ కేసులు, జైలు నిర్బంధాలతో చంపివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు.

మనస్తాపంతో కానిస్టేబుల్ ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

వేదసహస్ర, ఐదేళ్ల కుమారుడు మన్విత్‌సాయి ఉన్నారు. సాగర్ తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు ఇద్దరు ఎస్ఐలు, బూర్గంపాడు సీఐ సత్యనారాయణ, మరో వ్యక్తి గోనెల నానిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కానిస్టేబుల్ సాగర్ ఆత్మహత్యకు పాల్పడుతూ విడుదల చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాగర్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు తనను తీవ్రంగా వేధించారని ఆరోపించాడు. భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ దళితులు, గిరిజనులను చిన్న చూపు చూసే వారని ఆరోపించాడు. బాధ్యులపై చర్యలు తీసుకుని తన భార్య పిల్లలు, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబాన్ని కాపాడాలని వేడుకున్నాడు. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఈ వీడియోపై పలువురు స్పందించారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పాలేరు ఎడమకాల్వకు మళ్లీ పొంచి ఉన్న ప్రమాదం

కూసుమంచి, అక్టోబరు 13: పాలేరు జలాశయం నీటిమట్టం పెరిగింది. గరిష్టనీటిమట్టం 23అడుగులకు ప్రస్తుతం 21అడుగులకు నీటిమట్టం చేరుకుంది. మొదటిజోన్ నుంచి 4,600 క్యూసెక్కులనీరు పాలేరు జలాశయం చేరుతుండగా, దిగువ రెండోజోన్ ఆయకట్టుకు 3,800 క్యూసెక్కులు, పాలేరు పాతకాల్వకు 150క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా పాలేరు జలాశయం నీటిమట్టం ఇంతకంటే పెరిగిన పక్షంలో ఎడమకాల్వకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. జలవిద్యుత్ కేంద్రం వద్ద గత నెలలో వచ్చిన వరదకారణంగా గండిపడిన సంగతి తెలిసిందే. దీనికి తాత్కాలికంగా మట్టిపోసి మరమ్మతులు చేయగా నీటిమట్టం ఇంతకంటే పెరిగితే తాత్కాలిక మరమ్మతులతో పోసిన మట్టి నీటికి కొట్టుకుపోయి, మళ్లీ ఎడమకాల్వకు గండిపడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు పాలేరు నీటిమట్టం మరింత పెరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇందిరా డెయిరీని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- లాభాల్లో ప్రతీపైసా మహిళలకే..
- అర్హులైన నిరుద్యోగులకు రుణాలిచ్చి ఉపాధి చూపుతాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ఎర్రుపాలెంలో ఇందిర మహిళ డెయిరీ ప్రారంభోత్సవం

ఎర్రుపాలెం, అక్టోబరు 13: స్వయం సహాయక సంఘాల మహిళలతో కో-ఆపరేటివ్ సొసైటీని రూపొందించి పాడి రంగంలో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతామని, పాల ఉత్పత్తిలో ఇందిరా మహిళా డెయిరీ దేశానికే ఆదర్శవంతంగా నిలువుతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఎర్రుపాలెంలో చైతన్య మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ డెయిరీ పాల శీతలీకరణ కేంద్రాన్ని (బీఎంసీని) ఆదివారం భట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విజయదశమి రోజున మొదలుపెట్టిన ఇందిర మహిళ డెయిరీ ప్రాజెక్ట్ విజయవంతమవు తుందన్నారు.

మహిళలతో నిర్వహించే ఈ ప్లాంట్‌ను సందర్శించేందుకు ఇతర రాష్ట్రాలనుంచి అధికారులు, మహిళ సంఘాల సభ్యులు క్యూ కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమ ద్వారా జరిగే పాల ఉత్పత్తి ద్వారా వచ్చే ప్రతి పైసా మహిళా సభ్యులకే చెందేలా ప్రాజెక్టును రూపకల్పన చేశామన్నారు. పాల ఉత్పత్తి చేయడానికి మధిర నియోజకవర్గంలో ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యులకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రెండు గేదెలను పంపిణీ చేస్తుందని తెలిపారు. ఎర్రుపాలెం మండలంలో అర్హులైన నిరుద్యోగులను ఎంపిక చేసి కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేసి పచ్చిగడ్డి, దాణాను ఇంటింటికి సరఫరా చేయిస్తామన్నారు.

డెయిరీకి కావాల్సిన అన్ని వసతులను మహిళల ద్వారానే సమీకరించి వారి కుటుంబాలకు ఆర్థిక పురోగతి కల్పిస్తామన్నారు. 12 ఏళ్ల క్రితమే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశామని, బీఆర్ఎస్ ప్రభుత్వం దీన్ని నిర్వీర్యం చేసిందని భట్టి వాపోయారు.

ప్రజాప్రభుత్వంలో మహిళలను మహాలక్ష్మిలుగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సంఘాల సభ్యులకు ప్రతి ఏటా రూ.20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని నిరూపిస్తామని భట్టి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, తహసీల్దార్ ఉషాశారద, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో బయో పవర్‌ప్లాంట్

- ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

అశ్వారావుపేట, అక్టోబరు 13: అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో స్వయం విద్యుత్ ఉత్పత్తి కోసం నిర్మించిన బయో పవర్‌ప్లాంట్‌ను శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. 2.5మెగావాట్ల సామర్థ్యంతో రూ.36కోట్ల వెచ్చించి నిర్మించిన ఈ బయో పవర్‌ప్లాంట్ పామాయిల్ నుంచి వచ్చే వ్యర్థాలతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా నిర్మించారు. ప్రారంభ కార్యక్రమంలో మంత్రులతో పాటు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మహబూబాబాద్ ఎంపీ బలరామ్ నాయక్, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, చైర్మన్ జంగా రాఘవరెడ్డి, సత్తుపల్లి, కొత్తగూడెం, వైరా ఎమ్మెల్యేలు రాగమయి, కూనంనేని సాంబశివరావు, రాములునాయక్, మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, వ్యవసాయ ముఖ్య కార్యదర్శి రఘునందనరావు, ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఆయిల్ పామ్ రైతు సంఘ నాయకులు ఆలపాటి రామచంద్రప్రసాద్, ఏపీ సంఘ నాయకులు బొబ్బ రాఘవరావు, అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి ఆకుల బాలకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, నాగబాబు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్‌తో దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు చేపట్టాలి

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సత్తుపల్లి, అక్టోబరు 13: సత్తుపల్లిలో ఓపెన్ కాస్టు బొగ్గు గనిలో బ్లాస్టింగ్ కారణంగా దెబ్బతిన్న ఇళ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని సింగరేణి సంస్థ సీఎండీ బలరాంను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. శనివారం ఆయన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, సీఎండీ బలరాం నాయక్‌తో కలసి సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన వెంగళరావునగర్, జగన్నాథపురం పునరావాస కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా వెంగళరావునగర్‌లో బాధితులు ఓపెన్ కాస్టులో బ్లాస్టింగ్ కారణంగా దెబ్బ తిన్న ఇళ్లను భట్టికి చూపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. సంస్థలో సీనియర్ అధికారులతో కమిటీ నియమించి ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న ఇళ్లను గుర్తించి ఇళ్ల మరమ్మతులకు గాను పారదర్శకంగా టెండర్లు నిర్వహించి పనులు అప్పగించాలని ఆదేశించారు. సింగరేణి నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి సంబంధిత కాంట్రాక్టు ఏజన్సీల పేర్లు, వారి ఫోన్ నెంబర్లు స్థానికులకు తెలిసే విధంగా బోర్డులపై ప్రదర్శించాలని అన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. ఆర్వో వాటర్ ప్లాంట్లు అవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని వీటి నిర్వహణకు ఆవుట్ సోర్సింగ్ పద్దతిలో సిబ్బందిని నియమించాలని సూచించారు. అనంతరం జగన్నాథపురం పునరావాస కాలనీలోప్రాథమిక పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, సింగరేణి అధికారులు ఉన్నారు.



వెంగళరావునగర్‌లో పర్యటిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

కారు బోల్తా .. ఒకరి మృతి

» మరో ముగ్గురికి గాయాలు

» కూసుమంచి వద్ద ఖమ్మం-సూర్యాపేట హైవేపై ప్రమాదం



క్షతగాత్రులను కారులో నుంచి తీస్తున్న స్థానికులు

కూసుమంచి, అక్టోబరు 13: ప్రమాదవశాత్తు కారు బోల్తా కొట్టడంతో ఒకరు మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం మునిగేపల్లి ప్రాంతంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మం నగరంలోని కస్బాబజార్‌కు చెందిన ఓ కుటుంబం ఈనెల 12వతేదీన హైదరాబాద్‌లోని బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం ఆదివారం తెల్లవారు జామున కారులో హైదరాబాద్ నుంచి తిరిగి ప్రయాణమయ్యారు. కాగా పెళ్లి బస్సు ముందు వెళ్తుండగా, వీరి కారు వెనుక ప్రయాణిస్తోంది. ఈక్రమంలో కారు డ్రైవరు అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో కూసుమంచి మండలం మునిగేపల్లి సమీపంలో కారు పల్టీ కొట్టింది. ఈప్రమాదంలో ఖమ్మం జమామజీద్‌లో ఇమామ్‌గా పనిచేస్తున్న సయ్యద్ మొయినుద్దీన్ అలీ(57) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కారు డ్రైవర్ మహ్మద్ షఫిక్‌అహ్మద్‌కు తీవ్రగాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న మహిళ హంర్‌జహాన్, హమీద్‌ఖాన్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు అతివేగంగా వచ్చి పల్టీ కొట్టడంతో, అందులో ప్రయాణిస్తున్న వారు కారులో ఇరుక్కుపోయారు. జాతీయ రహదారి సిబ్బంది, స్థానిక పోలీసులు క్షతగాత్రులను బయటకు తీసి వెంటనే ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి బావ మహమూద్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ షఫిక్ అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు కూసుమంచి ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ద్విచక్ర వాహనం బోల్తా పడి వ్యక్తి..

కామేపల్లి, అక్టోబరు13: ద్విచక్ర వాహనం బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కామేపల్లి మండలం తాళ్లగూడెం గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందుకు చెందిన గోకినేపల్లి శ్రీనివాస్(38) ఖమ్మంలో ఓ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ప్రస్తుతం రఘునాథపాలెం మండలం వీవీపాలెం గ్రామంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. శనివారం రాత్రి ఉసిరికాయలపల్లిలోని శ్రీకోటమైసమ్మతల్లి జాతరకు వెళ్లి తిరిగి వస్తుండగా, ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి బోల్తా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సరిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వింజరం సర్పంచ్...



బాలరాజు(ఫైల్)

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 13: అశ్వారావుపేట మండలం కుడుములపాడు సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలోని ఆంధ్రాలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలానికి చెందిన సర్పంచ్ మృతి చెందారు. కుక్కునూరు మండలం వింజరం గ్రామ సర్పంచ్ జగిడి బాలరాజు(34) ద్విచక్ర వాహనంపై మండలంలోని నందిపాడు గ్రామం నుంచి తన స్వగ్రామం బర్లమడుగు వెళ్తుండగా, కుడుములపాడు సమీపంలో కుక్క అడ్డు రావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కిందపడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని అశ్వారావుపేటలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతడిని పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఎస్‌ఐ యయాతిరాజు ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్దెలగూడెంలో ఇద్దరు..

కరకగూడెం, అక్టోబరు 13: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన కరకగూడెం మండలంలో శనివారం జరిగింది. మండలంలోని కొత్తకోయ గ్రామానికి చెందిన మడకం భద్రయ్య (52), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన హిమ్లా దేవ (27) అనే ఇద్దరు వ్యక్తులు కూరగాయాలు కొనుక్కునేందుకు కరకగూడెం వైపు వస్తుండగా, మద్దెలగూడెం గ్రామ పరిధిలోని ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనం అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కరకగూడెం ఎస్‌ఐ రాజేందర్ సంఘటన స్థలం వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతుడు భద్రయ్య భార్య జోగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బతుకమ్మలను నీటిలో వదులుతూ..
ఇద్దరు యువకుల దుర్మరణం

చర్ల, అక్టోబరు13: బతుకమ్మలను నీటిలో వదులుతూ ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తేగడ వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్ల మండలం గన్నవరం కాలనీలో గ్రామస్థులు బతుకమ్మలను ఆడారు. శనివారం ఉదయం తేగడ వద్ద గల తాలిపేరు నీటితో వదిలేందుకు గ్రామస్థులు వెళ్లారు. ఇదే క్రమంలో బతుకమ్మలను వదులుతుండగా ప్రమాదవశాత్తూ గట్టువల్లి జంపయ్య (23), సోయం మహేందర్ (25)నీటిలో కొట్టుకొనిపోయారు. స్థానికులు వారిని కాపాడేందుకు ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. శనివారం ఉదయం అదే ప్రాంతంలో వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. చర్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని పంచనామా నిర్వహించారు. కాగా ఈ ఘటనపై ఆదివాసీ గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు బతుకమ్మల నిమజ్జనం వద్ద ఏర్పాట్లు చేయలేదని, అందుకే యువకులు మృతి చెందారని ఆరోపించారు.

విద్యుదాఘాతంతో మహిళ..

పినపాక, అక్టోబరు13: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని అమరారం గ్రామపంచాయతీ పరిధిలోని జెన్నెలగూడెం గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిజ్జం రజిత(25) తన ఇంటిలో వేడి నీళ్ల పెట్టుకునే క్రమంలో, విద్యుత్ హీటర్ బంద్ చేయకుండానే ముట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి భర్త ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏడూళ్లబయ్యారం ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య

ములకలపల్లి, అక్టోబరు13: మద్యానికి బానిసైన కొడుకును తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై కొడుకు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన ఎర్రప్పకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత ఆరేళ్ల క్రితం అతని కుమారుడు వెంకటకృష్ణ(27)తో ఝాన్సీరాణి అనే యువతితో వివాహం జరిగింది. కాగా గత ఆరు నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య భర్తలు ఇరువురు రోజు గొడవపడుతుండే వారు. ఇదే విషయమై కోడలు ఝాన్సీరాణి మామ ఎర్రప్పకు చెప్పింది. శనివారం కూడా అతడు తాగి రావడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. గ్రామశివారులోని పత్తి చేనులో ఓ మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ విషయమై మృతుడి తండ్రి ఎర్రప్ప ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి....



వెంకటనారాయణ

ఖమ్మంక్రైం, అక్టోబరు13: కుటుంబ ఖర్చుల కోసం నెలనెలా కట్టేలా ఓ ప్రైవేట్ కంపెనీలో తీసుకున్న చిట్టీ డబ్బులు చెల్లించలేక ఓ వ్యక్తి సాగర్ కాలవలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇటీవల ఖమ్మం నరగంలో జరిగింది. ఖానాపురంహవేలి పోలీసుల కథనం ప్రకారం.. వైరాకు చెందిన తాటికొండ వెంకటనారాయణ(50) అనే వ్యక్తి వడ్రంగి పనిచేస్తూ నగర శివారులోని వైఎస్ఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. వైరాలోని తనబంధువులతో కలి సి ప్రతినెలా చిట్టీకడుతున్నాడు. తీసుకున్న చిట్టీని ప్రతి నెలా చెల్లించకలేక కొద్ది రోజులు గా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో బంధువులు అతడి ఇంటివద్దకు వచ్చి నిలదీశారు. బ్యాం క్‌లో డబ్బులు ఉన్నాయని, ఫోన్‌పే ద్వారా చెల్లించేందుకు కుదరడం లేదని, వైరా బ్యాంకు వద్దకు వెళ్లి నగదు తీసుకువచ్చి చెల్లిస్తానని వారికి తెలిపి భార్యతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మం నుంచి వైరా బయలుదేరాడు. ఎస్ఆర్ గార్డెన్ పక్కకు రాగానే బస్సు ఆగడంతో బస్సులో నుంచి అతడు దిగి పరుగెత్తుకుంటూ వెళ్లి సమీపంలోని సాగర్ కాలవలో దూకాడు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. కాగా ఆదివారం మృతదేహాన్ని వెంకటాయపాలెం సమీపంలోని లాకుల వద్ద గుర్తించారు. పోలీసులు అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు చేయడంతో పలువురు బంధువులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మనస్తాపానికి గురై ఒకరు..

బోనకల్, అక్టోబరు 13: మనస్తాపానికి గురై ఆత్మహత్య పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన సంఘటన రావినూతల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చేబ్రోలు సైదులు(45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం భార్య మృతి చెందింది. ఆమె మృతితో మనస్తాపానికి గురైన అతడు వారం రోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఘనంగా కోటమైసమ్మ తల్లి జాతర ప్రారంభం

» అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కారేపల్లి, అక్టోబరు13: ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో నెలకొన్న కోటమైసమ్మ తల్లి జాతర దసరా పండుగ సందర్భంగా శనివారం ప్రారంభమైంది. ఈనెల 16వరకు జాతర కొనసాగనున్నదని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కోటమైసమ్మ తల్లిని దర్శించుకునేందుకు ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల నుంచే కాకుండా పరిసర ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వైరా, ఇల్లెందు ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్ నాయక్, కోరం కనకయ్యలకు కోటమైసమ్మతల్లి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ డాక్టర్ వర్గాపట్టాబీ రామారావు, ఈవో వేణుగోపాలచార్యులు, ఆలయ పూజారి కైలాష్‌శర్మ ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో వారికి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో భక్తులసౌకర్యం కోసం ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ వద్ద ప్రజలు పాల్గొని సందడి చేశారు.



జెయింట్‌వీల్స్ వద్ద సందడి చేస్తున్న ప్రజలు(ఇన్‌సెట్‌లో కోటమైసమ్మ తల్లి)



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, కోరం కనకయ్య



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

పెద్దమ్మతల్లి ఆలయానికి పోటెత్తిన భక్తజనం



బారులు తీరిన భక్తులు

పాల్వంచ రూరల్, అక్టోబరు13 : పెద్దమ్మతల్లి ఆలయంలో దసరా మహోత్సవాన్ని పురస్కరించుకుని శని, ఆదివారాల్లో భక్తులతో నిండిపోయింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయం కిక్కిరిసింది. ఆలయ ప్రాంగణం చుట్టు భక్తులతో సందడి నెలకొంది. అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. విజయదశమి రోజున రాజరాజేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అనంతరం సెమీ పూజను ఘనంగా నిర్వహించారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేపట్టారు. అన్న ప్రసాద వితరణ జరిగింది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ రూరల్ పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. దేవాలయం ఈవో రజనికుమారి పర్యవేక్షణలో మహోత్సవ కార్యక్రమాలు జరిగాయి.

విజయదశమి రోజున పెద్దమ్మతల్లి ఆలయంలో వాహనాలకు పూజలు చేయించడం ఆనవాయితీగా మారడంతో ఈ దసరా పండుగ రోజు ఆలయ ప్రాంగణం వెలుపల మైదానంలో వాహనాలకు ప్రత్యేక పూజల కోసం ఏర్పాటు చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఆళ్లపల్లి, అక్టోబరు13: ఓ యువకుడు ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని నడిమిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. నడిమిగూడెం గ్రామానికి చెందిన పాయం మనోహర్, హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ట్రావెల్‌లో పని చేస్తున్నాడు. దసరా పండుగ నేపథ్యంలో స్వగ్రామానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 ద్వారా ఆళ్లపల్లికి తరలించి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు. ఆత్మహత్యాప్రయాత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

గంజాయి సేవిస్తున్న
నలుగురు యువకుల అరెస్టు

» 170గ్రాముల గంజాయి స్వాధీనం

పెనుబల్లి, అక్టోబరు 13: వీఎంబంజర్‌లోని ఎన్నెస్పీ కాల్వ కట్ట మీద గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ కె.వెంకటేష్‌కు ఎన్నెస్పీ కాల్వ వద్ద అనుమానాస్పదంగా నలుగురు యువకులు కన్పించారు. పోలీసులను వారు పారిపోతుండగా ఎస్‌ఐ వెంబడించి పట్టుకున్నారు. టేకులపల్లికి చెందిన కొప్పుల శివశంకర్, రంగారావు బంజర్‌కు చెందిన పొదిలి రాజేష్, ముదురుకోళ్ల వీరబాబు, గొర్రిజు హరికృష్ణలుగా గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ పేర్కొన్నారు.

సత్తుపల్లిలో పిచ్చికుక్క స్వైర విహారం

» 28 మందిని కరిచిన కుక్క » కుక్కను చంపిన స్థానికులు, మునిసిపల్ సిబ్బంది

సత్తుపల్లి, అక్టోబరు 13: సత్తుపల్లి మునిసిపాలిటీలోని 21, 22 వార్డుల్లో, మెయిన్‌రోడ్డులో పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. శనివారం రోడ్డుపై వెళుతున్న ప్రతి ఒక్కరిపై దాడి చేస్తూ అతి దారుణంగా కరిచింది. విద్యానగర్‌రోడ్డు, ఎండీ హాస్పిటల్ రోడ్డు, చర్చిరోడ్డు, ఎస్‌బీఐ ప్రాంతాల్లో తిరుగుతూ పలువురిపై దాడి చేసి గాయపరిచింది. దీంతో స్థానికులు కుక్క వెంటపడి తరిమేశారు. కుక్క దాడికి మరింత మంది గాయపడుతూండటంతో స్థానికులు, మునిసిపల్ సిబ్బందితో కలసి కుక్కను చంపేశారు. మొత్తం 28 మందిని పిచ్చి కుక్క కరిచింది. దీంతో పలువురు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం నిమిత్తం పరుగులు పెట్టారు. మరి కొందరు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించారు. పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ దాడి చేస్తోందని సోషల్‌మీడియాలో ప్రచారం జరగడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

కారేపల్లి, అక్టోబరు13: తేనెటీగల దాడిలో పలువురు గాయపడిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. మండల కేంద్రలోని శ్రీవేంకటేశ్వరసంతలో ఉన్న చెట్లకు ఉన్న తేనె తెట్టెకు గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు వేశారు. దీంతో పెద్ద ఎత్తున తేనెటీగలు సంతలో ఉన్న పలువురు వ్యక్తులపై దాడి చేశాయి. దీంతో వారు భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఈగలు కుట్టిన క్షతగాత్రులను స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అమ్మవారి మండపం వద్ద ఘర్షణ

ఖమ్మంక్రైం, అక్టోబరు13: నగరంలోని ప్రకాష్‌నగర్ సమీపంలో అమ్మవారి మండపం వద్ద శనివారం రాత్రి ఘర్షణ జరిగింది. మండపం వద్దకు కొందరు వచ్చి ఆలయ కమిటీ నిర్వాహకులతో ఘర్షణ పడ్డారు. ఈవిషయం తెలిసిన విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు త్రీటౌన్ పోలీసులతో కలిసి ఇరువర్గాల వారితో మాట్లాడి అక్కడి నుంచి పంపించి వేశారు. అనంతరం ఈవిషయాన్ని నగర ఏసీపీ దృష్టికి బాధ్యులు తీసుకెళ్లారు.

రాజాపురంలో వ్యక్తి అదృశ్యం

పాల్వంచ, అక్టోబరు12: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం..పాల్వంచ మండలం రాజాపురం గ్రామానికి చెందిన యాసా మధుసూదన్ స్థానికంగా చేపల చెరువు నిర్వహిస్తున్నాడు. గత నెలలో వచ్చిన వరదలకు చెరువులోని చేపలు కొట్టుకుపోవడంతో పాటు తన స్థలంలో పెంచుకుంటున్న నాటుకోళ్లసైతం వరదలకు కొట్టుకుని పోయి సుమారు రూ.15 లక్షలవరకు ఆర్థికంగా నష్టపోయాడు. దీంతో అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయాడు. తరచూ అదే విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పుకుని బాధపడుతుండేవాడు. తనకు జరిగిన నష్టాన్ని పరిశీలించి ఆదుకోవాలని ప్రభుత్వ అధికారులకు నివేదించాడు. సంబంధిత అధికారులు విచారణ చేసి కొంత నష్టపరిహారంగా ఇచ్చినా, ఫలితం లేకుండా పోయింది. తనకు జరిగిన నష్టానికి తనకు అందిన సాయానికి సంబంధం లేదని మనోవేదనతో మధుసూదన్ శుక్రవారం బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద విచారించిన అతని ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. మధుసూదన్ భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

గొర్రెల మందను ఢీకొట్టిన కారు

● మృత్యువాతపడిన 15గొర్రెలు

కూసుమంచి, అక్టోబరు 13: ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై నాయకన్‌గూడెం వద్ద ఆదివారం సాయంత్రం గొర్రెల మందను కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో సుమారు 15గొర్రెలకు పైగా మృత్యువాతపడగా, మరికొన్ని గాయపడ్డాయి. ఖమ్మం నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు నాయకన్‌గూడెం టోల్‌ప్లాజా సమీపంలో అడవి నుంచి ఇంటికి తోలుకెళుతున్న గొర్రెల మందను వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈప్రమాదంలో కాంచాని వెంకయ్యకు చెందిన గొర్రెలు మృత్యువాతపడ్డాయి. సుమారు రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు యజమాని తెలిపారు. ఈమేరకు వెంకయ్య పోలీసులను ఆశ్రయించారు.



ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు

రోడ్డు ప్రమాదంలో
ఇద్దరు చిన్నారులకు గాయాలు

పాల్వంచ, అక్టోబరు 12 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు గాయలైన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.మండల పరిధిలోని కేశవాపురం గ్రామంలో నివసిస్తున్న బానోతు రవి- నానుకల కుమార్తెలు వైష్ణవి, ధనుశ్రీలు శనివారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న రోడ్డుపై ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మౌర్య ప్రతాప్ అజాగ్రత్తగా, అతి వేగంగా తన ద్విచక్రవాహనాన్ని నడుపుకుంటూ వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చిన్నారులకు గాయాలుకాగా వారిని కుటంబ సభ్యులు హుటాహుటిన వారిని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న నిందితుడు మౌర్య ప్రతాప్, రవితో వాగ్వాదానికి దిగి అతనిని దుర్భాషలాడాడు. చిన్నారుల తల్లి నానుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

మణుగూరులో వ్యక్తికి..

మణుగూరు రూరల్: మణుగూరు ఏరియాలో దుర్గా ఓబి కంపెనీ మేనేజర్‌గా పనిచేసే ముత్తుకుమార్‌కు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం తమ కంపెనీ వాహనంలో మణుగూరు నుంచి గుట్ట మల్లారం గ్రామం వైపునకు వెళ్తుతుండగా మలుపు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని పెట్రోలింగ్ పోలీసులు స్థానిక వైద్యశాలకు తరలించారు.

తనయుడిచేతిలో తండ్రి మృతి

● వడ్లగూడెం గ్రామంలో ఘటన

దమ్మపేట, అక్టోబరు13: తనయుడు చేతిలో తండ్రి మృతి చెందిన ఘటన మండలంలోని వడ్లగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కంటంపాటి సత్యనారాయణ మద్యానికి బానిసై డబ్బులు కోసం వేధిస్తుండడంతో అతడి తండ్రి కృష్ణయ్య(75) డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించాడు. దీంతో సత్యనారాయణ కత్తితో తండ్రి గొంతు కోశాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు సత్తుపల్లి వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు దమ్మపేట ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

గుండెపోటుతో చిన్నారి...

» పట్వారీగూడెంలో విషాదం

» నేత్ర దానం చేసిన కుటుంబ సభ్యులు



తేజస్విని(ఫైల్)

దమ్మపేట, అక్టోబరు 13: గుండెపోటుతో ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని పట్వారీ గూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం.. పట్వారీగూడెం గ్రామానికి చెందిన వాసవీ క్లబ్ చైర్మన్ పరిటాల నాగచక్రధరరావు కుమార్తె సౌమ్య తేజస్విని(8)తల్లిదండ్రులతో కలిసి అప్పటి వరకు అమ్మవారి పూజా వేడుకలలో పాల్గొన్నది. పూజా వేడుకల అనంతరం శనివారం సాయంత్రం బతకమ్మ వేడుకలకు వెళ్లేందుకు పూజ సామాగ్రితో సిద్ధమైంది. కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలలో నిమగ్నమై ఉండగా చిన్నారి ఒక్కసారిగా కుప్ప కూలిపోయింది. ఇది చూసిన కుటుంబసభ్యులు వెంటనే సత్తుపల్లి, ఖమ్మం తరలించగా చికిత్స పొందు తూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. సౌమ్య తేజస్విని పట్వారిగూడెం ప్రభుత్వ పాఠశాలలో మూడవ తరగతి చదువుతుంది. ఆఇంట విషాదంలో ఉన్నా, సేవా కార్యక్రమాలలో పాల్గొనే చిన్నారి తండ్రి చక్రధర్ విషాదంలో మరోకరికి ఇంట వెలుగు నింపాలని చిన్నారి నేత్రాలను విజయవాడకు చెందిన ఈబీపీఈ బ్యాంక్‌కు దానం చేశారు. చిన్నారి మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, దారా మల్లికార్జునరావు, కొయ్యల అచ్యుతరావులతో పాటు పలువురు చిన్నారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. విజయదశమి అందరి గృహాలలో వెలుగులు నింపాల్సి ఉండగా, చిన్నారి మృతితో ఆఇంట విషాదం అలుముకుంది.

అనారోగ్యంతో టీపీఎఫ్ నేత...



శ్రీనివాస్(ఫైల్)

ఇల్లెందు అక్టోబరు13: తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రడం శ్రీనివాస్ (50)శనివారం అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. ఇల్లెందు మండలం కోమరారం గ్రామానికి చెందిన ఆయన గత మూడు దశాబ్దాలుగా న్యూ డెమోక్రసీ మావోయిస్ట్ ఉద్యమాల్లో క్రియాశీలంగా పాల్గొన్నారు. తొలుత అరుణోదయ సాంస్కృతిక ఉద్యమానికి నాయకత్వం వహించిన శ్రీను రాజకీయ విభేదాలతో మావోయిస్ట్ పార్టీ ఉద్యమాల్లో పాల్గొని ప్రజా కళా మండలికి నాయకత్వం వహించారు. కొంత కాలం తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. టీపీఎఫ్ రాష్ట్ర నాయకులు నలమాస కృష్ణ, అచ్చ విద్యాసాగర్, చిత్ర రవి, మెంచ రమేష్, సంజీవరావు, న్యూ డెమోక్రసీ నాయకులు ఆజ్మీరా బిచ్చ, తదితర ప్రజా సంఘాల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శ్రీను మృతి పట్ల న్యూడెమోక్రసీ నాయకులు జే. సీతారామయ్య, గౌని ఐలయ్య, యాకన్న తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రడం శ్రీను బాల్య దశ నుంచే విప్లవ సంస్థల్లో తన కళా నైపుణ్యాన్ని పదును పెట్టి ఆట పాటలతో ప్రజలను చైతన్యవంతం చేశాడని, చివరి వరకు విప్లవోద్యమంలో సాయుధ రాజకీయాలతో పలువురిని చైతన్య పరిచాడని కొనియాడారు.

అలాయ్ బలాయ్‌లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 13: హైదరాబాదులో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన అలాయ్ బలాయ్ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతులమీదుగా అవార్డు అందుకున్న పెసర ప్రభాకరరెడ్డిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయలు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి మంత్రి తుమ్మల పర్యటన

రఘునాథపాలెం,ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 13: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఖమ్మం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రజాబ్‌అలీనగర్, ఎన్వీ బంజర, పంగిడి, రఘునాథపాలెం, సారధినగర్, హర్యాతండా, బద్యాతండా, సారధినగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు.

హమాలి పనులు స్థానికులకు కేటాయించాలి

చింతకాని, అక్టోబరు 13: పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ గూడ్స్ షెడ్డుకు సంబంధించి ఎగుమతులు, దిగుమతుల హమాలి పనులను స్థానిక గ్రామాల హమాలీ యూనియన్‌కు కేటాయించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఆదివారం మండల పరిధిలోని పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద సీఐటీయూ యూనియన్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఇతర ప్రాంతాల వారికి పనులు కేటాయించడం వలన స్థానిక హమాలీలు ఆర్థికంగా నష్టపోతారన్నారు. అచ్చుగూడెం, రామకృష్ణాపురం, పందిళ్లపల్లి, గాంధీనగర్, బస్వాపురం గ్రామాలకు సంబంధించిన వారు హామీల సంఘంగా ఏర్పడ్డారని వారికి పనులు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మడివల్లి గోపాలరావు, వత్సవాయి జానకిరాములు, భూక్యా శ్రీనివాస్. గండారపు రామారావు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి


రామారావు(ఫైల్)

చింతకాని, అక్టోబరు 13: టీడీపీ సీనియర్ నాయకులు మండల పరిధిలోని నరసింహాపురం గ్రామానికి చెందిన నన్నక రామారావు(70) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతదేహన్ని పలు పార్టీల మండల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

ఘనంగా దసరా వేడుకలు

▸ పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

నెట్‌వర్క్: దసరా ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి.ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దసరా ఉత్సవాలలో పాల్గొన్నారు. శనివారం మధిర లోని తన క్యాంపు కార్యాలయంలో సతీమణి నందిని తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయుధ పూజ, వాహన పూజ నిర్వహించారు. ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియచేశారు. పలు పోలీసుస్టేషన్లలో ఆయుధ పూజ నిర్వహించారు. ప్రజలు జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.


ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ


పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి దంపతులు


తనికెళ్లలో అమ్మవారి విగ్రహ ఊరేగింపు


ఖమ్మంలో జమ్మిచెట్టు వద్ద పూజలు


తల్లాడలో దసరా ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి


ఖమ్మం గాంధీచౌక్‌లో జమ్మిచెట్టుకు పూజలు



కల్లూరు, వైరాలో బతుకమ్మల నిమజ్జన కార్యక్రమం




ఖమ్మంలో అమ్మవారి విగ్రహాల ఊరేగింపు, మున్నేరులో నిమజ్జనం

పేదలకు వస్త్రాలను పంపిణీ చేసిన ఎంపీ వద్దిరాజు


చీరలు అందజేస్తున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 13: ఖమ్మం గాంధీ చౌక్‌లోని వరప్రదాత షిర్డీసాయిబాబా దేవాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పాల్గొని పేదలకు నూతన వస్త్రాలను పంపిణీచేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చీరలు, లుంగీలు, టవళ్లు తదితర వస్త్రాలను పేదలకు అందించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, తదితర కమిటీసభ్యులు ఆర్వపల్లి నిరంజన్, కురువెళ్ల వెంకట జగన్మోహన్ రావు, పీవీడీ ప్రసాద్ కాకరపర్తి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు భగీరథ కార్మిక సంఘ అధ్యక్షుడిగా లక్ష్మణ్

కల్లూరు, అక్టోబరు 13 కల్లూరు సబ్‌డివిజన్ మిషన్ భగీరథ కార్మిక సంఘం అధ్యక్షుడిగా అజ్మీర లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉబ్బన వేణు ఎన్నికైనారు. ఆదివారం కల్లూరులో సబ్ డివిజన్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల రవి ముఖ్య అతిథిగా రాగా ఆయన అధ్యక్షతన ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ నాయకులు ఓర్సు రవి, బత్తుల కిషోర్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

భూమి పట్టాలివ్వడమే అసలైన పండుగ: మల్లు నందిని

ఎర్రుపాలెం, అక్టోబరు 13: భూమిలేని నిరుపేదలకు భూమి పట్టాలివ్వడమే అసలైన దసరా పండుగ అని అమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. మండలంలోని భీమవరం గ్రామంలో దసరా వేడుకల్లో శనివారం ఆమె పాల్గొన్నారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్‌నేత యరమల పూర్ణచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మల్లు నందినికి గజమాలతో స్వాగతం పలికారు. స్వగ్రామమైన భీమవరం కోసం కేవీఆర్‌హోమ్స్ అధినేత పూర్ణచంద్రారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆమె కొనియాడారు. గ్రామంలోని నిరుపేదలకు ఒక్కొక్కరికి మూడు సెంట్లు చొప్పు నకిమందికి పూర్ణచంద్రారెడ్డి తన సొంతస్థలంలో ఇళ్ల పట్టాలను మల్లు నందిని చేతులమీదుగా అందించారు. ఇళ్ల పట్టాలు పొందిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేందుకు తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, నాయకులు అనుమోలు కృష్ణారావు, శీలం శ్రీనివాసరెడ్డి, బండారు రామారావు, వెజెండ్ల సాయి, శీలం శారద, అనుమోలు శ్రీదేవి, గుర్రాల శ్రీనివాసరెడ్డి, యరమల శ్రీనివాసరెడ్డి, శీలం లింగారెడ్డి పాల్గొన్నారు.

317జీవో బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 13: 317జీవో బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందించారు. ఈజీవో వలన ఉపాధ్యాయులు, ఉద్యోగులు కొందరు సొంత జిల్లాలు కాదని ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ, ఉద్యోగ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, అక్టోబరు 13: సత్తుపల్లి మండలం కిష్టారంలో ఎస్సీ, బీసీ కాలనీల్లో సింగరేణి బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లు నష్టపోయిన బాధితులకు ఇళ్లు నిర్మించేందుకు శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ15 ఏళ్లుగా పరిష్కారం కాని సమస్య కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లాకు చెందిన మంత్రుల సహకారంతో పరిష్కారమవుతోందని అన్నారు. నిర్మాణంలో ఎటువంటి లోపం లేకుండా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కిష్టారం పీవో నరసింహారావు, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.

అందుబాటులోకి ఏసీ క్యాబిన్‌తో ట్రాక్టర్లు

● జాన్ డీర్ ఏసీ క్యాబిన్ ట్రాక్టర్లను ప్రారంభించిన ఏసీపీ రమణమూర్తి


ట్రాక్టర్ తాళాలను అందజేస్తున్న ఏసీపీ రమణమూర్తి

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 13: ఏసీ క్యాబిన్‌తో ట్రాక్టర్లు అందుబాటులోకి రావటం విప్లవాత్మకమైన మార్పు అని ఖమ్మం ఏసీపీ రమణమూర్తి, వీవీసీ సంస్థల చైర్మన్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం వీవీసీ మోటార్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీ క్యాబిన్ ట్రాక్టర్లను కాంగ్రెస్ నాయకుడు మిక్కిలినేని నరేంద్రతో కలిసి ఏసీపీ ఆవిష్కరించారు. వంకాయలపాటి రాజేంద్రప్రసాద్(రాజా) మాట్లాడుతూ ఏసీ క్యాబిన్, పవర్ స్టీరింగ్, కంఫార్టుబుల్ సీట్స్‌తో జాన్‌డీర్ ట్రాక్టర్ కంపెనీ ఆధునిక ట్రాక్టర్లను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. జాన్‌డీర్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైరాలో డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం


వైరాలో భట్టికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

వైరా, అక్టోబరు 13: వైరాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. విజయదశమి సందర్భంగా శనివారం మధిర నుంచి వైరా వచ్చిన భట్టి విక్రమార్కకు వైరాలోని క్రాస్‌రోడ్డు వద్ద స్వాగతం పలికారు. భట్టి నాయకులు, కార్యకర్తలతో కరచాలనం చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, వైరా ఏఎంసీ మాజీ చైర్మన్లు బీడీకే. రత్నం, పసుపులేటి మోహన్‌రావు, నాయకులు బోళ్ల గంగారావు, చప్పిడి వెంకటేశ్వరరావు, పాలేటి నర్సింహారావు, గుగులోతు రాము, వమ్మి అశోక్, వడితి శ్రీను పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మించాలని డిప్యూటీ సీఎంకి టీడీపీ వినతి

బోనకల్, అక్టోబరు 13: స్థానిక రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించేలా చూడాలని ఆదివారం టీడీపీ నాయకులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బోనకల్ బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చూడాలని, స్టేషన్ ప్రాంతంలోని 11, 12 వార్డులను కలిపి ప్రత్యేక పంచాయతీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో టీడీపీ మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, సాదినేని హన్మంతరావు, మైనేని రవి కుమార్, షేక్ బాజీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి: బీజేపీ

బోనకల్, అక్టోబరు 13: సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణలు కోరారు. మండలంలోని రావినూతల తదితర గ్రామాల్లో ఆదివారం వారు పర్యటించారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు.కార్యక్రమంలో బీజేపీ మండల, జిల్లా నాయకులు వీరపనేని అప్పారావు, గుగులోతు నాగేశ్వరావు, తాళ్లూరి సురేష్, జంపాల రవి, పరుశురాం, గోపాల్, సైదా పాల్గొన్నారు.

విగ్రహ పునః ప్రతిష్ఠ శంకుస్థాపనలో మంత్రి తుమ్మల


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల

సత్తుపల్లి, అక్టోబరు 13: సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని హనుమాన్ నగర్‌లో ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠకు సంబంధించి ఆదివారం శంకుస్థాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొన్నారు. శంకుస్థాన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన సొసైటీ చైర్మన్లు

తల్లాడ: వ్యవసాయ, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావును ఆదివారం తల్లాడ మండలం కలకొడిమ, గంగదేవిపాడు సొసైటీ చైర్మన్లు దిరిశాల నరసింహారావు, తూము వీరభద్రరావు కలిశారు. గంగదేవిపాడు సొసైటీ నూతన భవనం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా వారు మంత్రిని ఆహ్వానించారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయిని కూడ వారు కలిశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు దుండేటి వీరారెడ్డి, పి లక్ష్మినారాయణ, జి రవి, శరత్‌బాబు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మరణం ప్రభుత్వ పరోక్ష హత్యే

▸ మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 13: ప్రజల హక్కుల కోసం నిలబడి వామపక్ష విప్లవ మేధావిగా ఉన్నందుకు ప్రొఫెసర్ సాయిబాబాపై ప్రభుత్వాలు అక్రమంగా కేసుల్ని బనాయించి 3,588 రోజులు పాటుగా నాగపూర్ జైల్‌లో ఉంచి పరోక్షంగా సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా హత్య చేసిందని, 90శాతం దివ్యాంగులుగా ఉన్న వ్యక్తికి కనీస వైద్యసేవలకు అనుమతి ఇవ్వలేదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ కమిటీ సభ్యులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ సాయిబాబా కు నివాళులు అర్పించారు. పోటు రంగారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యవాదులు, వామపక్ష మేధావులపై బీజేపీ ప్రభుత్వం హత్యా రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. సాయిబాబా లాంటి మేధావులు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమన్నారు. ఆయన రచనలు ప్రజల గొంతుకగా ఉండేవన్నారు. సాయిబాబా జైలు నుంచి విడుదలైన కొద్ది రోజులకే ఇలా మృత్యువాత పడటం విషాదకరమన్నారు. సాయిబాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సీపీఎం నివాళి

ఖమ్మంటౌన్: ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ జీఎన్ సాయిబాబా మృతికి సీపీఎం జిల్లా కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు సాయిబాబా మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. 90శాతం అంగవైకల్యం ఉన్నా పట్టుదలతో ఉన్నత చదువులు చదివి సమాజంలో ఉన్న అసమానతలకు వ్యతిరేకంగా ప్రజల తరుపున పోరాడారన్నారు. దళిత, గిరిజన, ఆదివాసీ, దివ్యాంగుల హక్కుల కోసం తన జీవితాంతం పోరాటం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్లు అక్రమంగా నాగపూర్ అండా జైలులో నిర్బంధించినా మొక్కవోని ధైర్యంతో ప్రజలకోసం నిలబడ్డారని కొనియాడారు.

పోరాటాల ద్వారానే విద్యార్థుల సమస్యలు పరిష్కారం

▸ పీడీఎస్‌యూ పోరాటాలతోనే విద్యా ప్రమాణాలు పెంపు: మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 13: విద్యా కార్పొరేటీకరణ జరిగిన ఈ రోజుల్లో కూడా ప్రభుత్వ విద్యా మంచి ప్రమాణాలతో కొనసాగుతుందంటే దాని వెనుక 50ఏళ్ల పీడీఎస్‌యూ ఉద్యమ పోరాటాలు ఉన్నాయని, శాస్త్రీయ విద్యా నినాదంతో 1974 అక్టోబరు 13న ఏర్పాడిన ప్రగతిశీల విద్యార్థి సంఘం అనేక పోరాటాలు చేసి జార్జిరెడ్డి వంటి నాయకులు అమరవీరులైనారని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. ప్రముఖ రచయిత కొమిరా వెంకన్న రాసిన విద్యార్థి కుసుమాలు(ఉద్యమ గీతం) పాటల సీడీని అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్నతో కలిసి పోటు రంగారావు ఆవిష్కరించారు. ఈ మేరకు ఆదివారం ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సీడీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.

కొమిరా వెంకన్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థి కుసుమాల గేయాలు రాయటం అభినందనీయమన్నారు. విద్యా సమస్యలున్నంతకాలం పీడీఎస్‌యూ పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు నాగన్న మాట్లాడుతూ పీడీఎస్‌యూ పోరాటాలను వివరించారు. కాకి భాస్కర్, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షులు రాయల రవికుమార్, మనోహర్‌రాజు, ఆవుల అశోక్, సల్వాది విజయ్, మేకల నుగుణరావు, ఝాన్సీ కంపటి పృధ్వి, మంద సురేశ్, లక్ష్మణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

పొంగులేటి ఆత్మీయ పలకరింపు

▸ విజయదశమి వేళ నాయకుల ఇళ్లకు మంత్రి రాక


బొర్రా రాజశేఖర్ కుటుంబసభ్యులతో మంత్రి పొంగులేటి

కూసుమంచి, అక్టోబరు 13: విజయదశమి రోజున రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ నాయకుల ఇళ్లకు అనుకోకుండా వెళ్లి ఆత్మీయ అతిథిగా మారారు. పాలేరు నియోజకవర్గంలోని పలుమండలాల్లో నాయకుల ఇళ్లకు వెళ్లి సరదాగ పలకరించారు. కబుర్లు చెపుతు కాసేపు కాలక్షేపం చేశారు. పండుగ వేళ అనుకోని అతిథిగా మంత్రి రావడంతో నాయకులతో పాటు వారి కుటుంబసభ్యుల ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. కుటుంబసభ్యుల్లో ప్రతిఒక్కరిని పలకరిస్తూ పొంగులేటి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కూసుమంచి మండలకేంద్రంలో దండ్యాల లక్ష్మణ్‌రావు ఇంటికి, ఖమ్మంరూరల్ మండలంలో ధారావత్ రామ్మూర్తి ఇంటికి వెళ్లి వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు.

బొర్రా ఇంటా పొంగులేటి తేనేటి విందు

వైరా: వైరాలోని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ ఇంట్లో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తేనేటి విందుకు హాజరయ్యారు, విజయదశమిని పురస్కరించుకొని శనివారం రాత్రి బొర్రా ఇంటిని పొంగులేటి సందర్శించారు. మంత్రికి బొర్రా కుటుంబసభ్యులు, కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. రాజశేఖర్‌తోపాటు ఆయన సతీమణి మాజీ జడ్పీటీసీ బొర్రా ఉమాదేవి, ఆయన మాతృమూర్తి, మాజీ సర్పంచ్ బొర్రా పద్మావతి కుటుంబసభ్యులందరితో మంత్రి ముచ్చటించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మాజీ జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు మచ్చా బుజ్జి, మిట్టపల్లి నాగి, వడితి సైదులు, షేక్ రహీం, దార్న రాజశేఖర్, బాణోతు విజయబాయి, మాజీ ఏఎంసీ చైర్మన్ బీడీకే.రత్నం పాల్గొన్నారు.

మంత్రిచే కనకదుర్గ ట్రేడర్స్ ప్రారంభం

కల్లూరు: కల్లూరులో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం శ్రీకనకదుర్గ ట్రేడర్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఏనుగ సత్యంబాబు, ఎస్‌కే ఉస్మాన్, టి హనిమిరెడ్డి, తోటకూర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


కల్లూరు మండలం కప్పలబంధం పాఠశాలలో పూర్వ విద్యార్థులు


ఏన్కూరులో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కల్లూరు/ఏన్కూరు, అక్టోబరు 13 కల్లూరు మండలంలోని కప్పలబంధం ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలియక సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ పాఠశాలలో 1957-2024 వరకు చదివిన విద్యార్థులు, నాటి గురువులు ఈ సమ్మేళనంలో పాల్గొని ఆత్మీయ కలియికగా ఒకే వేదికపై సమావేశమైనారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పరస్పరం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాలలో నాటి గురువుల విద్యాబోధన, క్రమశిక్షణ, బాల్యదశలో కలిసి తిరిగిన తీపి జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు నెమరవేసుకున్నారు. 67 ఏళ్ల క్రితం పాఠశాలల్లో పక్కా భవనాలు లేక తాటకు గుడిసెల్లో చదువుకున్న జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు. నాడు పేదకుటుంబాల్లో తల్లిదండ్రులు పాఠశాలలకు పంపటం చాల కష్టంగా ఉండేదన్నారు. ఈ పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు చదువుకొని గురువుల బోధనలతో పలు రంగాల్లో ఉన్నతంగా స్థిరపడ్డారని పూర్వ విద్యార్థులు పుల్లయ్య, కర్నాటి వెంకటరెడ్డి చెప్పారు.

ఏన్కూరు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పాఠశాలలో 1999-2000లో చదువుకున్న విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత పాఠశాలలో కలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో కంపసాటి కిషోర్, బుద్ధాల నేస్, పాముల హరీస్, కృష్ణయ్య జాగర్లమూడి సురేష్, తాళ్లూరి నవీన్, రమాదేవి, గౌసియాబేగం, రజని, లక్ష్మి పాల్గొన్నారు.